
కథానిక:




అతన్ని నేను బాగా ఎరుగుదును, మా బళ్లోకి వెళ్లేదారిలో అరుగుమీద కూర్చుని అతను జోళ్లు కుట్టేవాడు అతన్ని నేను బాగా ఎరుగుదును అతను కుట్టిన జోళ్లుమాత్రం ఆ ఊరివారందరికీ బాగా తెలుసు అతని ముఖం ముందు కాకపోయినా చాటుగానన్నా వాటి శ్రేష్ఠతను గురించి నలుగురూ కచేరీ సావిట్లో కూర్చొని చెప్పుకొనేవారు అప్పుడు జోడు కుట్టడం తడవు ఎవరిమటుక్కు వారే పోటీలుపడి పట్టుకుపోయేవారు

అతన్ని మొదటిసారిచూసింది నా ఆరో ఏట అప్పటి జోళ్ల మన్నికనీ, వాటి చౌకతనాన్నీ ప్రశంసించేవారయితే చాలామంది ఉన్నారుగాని అప్పటి జీవిత రహస్యాన్నీ, అతని జీవిత తత్వాన్నీ తెలిసిన వాళ్లు ఇంకెవళ్లూ లేరు ఆ గౌరవం, ఆ ప్రతిష్ఠ నాకే దక్కాయి కోహినూర్ వజ్రంకంటే అమూల్యమైన అతని అనుభవాల్ని అంత చిన్నవయస్సులోనే చిక్కబట్టుకొని జాగ్రత్తగా దాచుకొంటూ వచ్చాను

మా నాన్నని నేను ఎరగను మా అమ్మ కూడా నాకు సరిగ్గా జ్ఞాపకంలేదు మా అమ్మని సవారీమీద దేవుడిగుడికి తీసికెళ్లిన దృశ్యంమాత్రం నాకు జ్ఞాపకం ఉంది మళ్ళీ మా అమ్మ రాలేదేమని మా తాతయ్యని అడిగినప్పుడల్లా దగ్గిరికి తీసుకొని కళ్ల నీళ్లు పెట్టుకొనేవాడు కడుపుమీద పడుకోబెట్టుకొని కల్లబొల్లి కబుర్లతో మరపించాలని ప్రయత్నించేవాడు మా తాతయ్యే మొద్లో నాకు ఎంతో ఇష్టమైన స్నేహితుడు 'మొద్లో' అని ఎందుకన్నానంటే రానురాను మా తాతయ్య కొంత పాడయిపోయ్యాడు ఇరవై ఇరవైలదాకా ఎక్కాలు తలకిందలా అప్పజెప్పమనటం బొత్తిగా మొండితనం కాకపోతే ఏమిటి?

మా తాతయ్య బాధపడలేక నేను బాధపడుతున్న రోజుల్లో అప్పడి పరిచయం ఏర్పడింది అప్పణ్ణి పరిచయం చేసింది కూడా మా తాతయ్యే అప్పటికి అప్పడి వయస్సు నలభైఐదు సంవత్సరాలు భు—కేమీ లోపం లేకపోయినా శాంతికిమాత్రం అతని జీవితం మొహం వాచింది అతని ముఖంలోని ముడతలు, నెరిసిపోయిన జుట్టే అందుకు సాక్ష్యం తన పొడుగైన జుట్టుని వెనక్కి దువ్వి చివర ముడి వేసేవాడు నుదుటిమీది కురుల్ని ముందుకు దువ్వుకొనేవాడు ముఖంనిండా నూనె జిడ్డు ఓడుతూ ఉండేది తొడలమీద చిరిగిన పంచెతో ఒక్క మోకాలు ముందుకు వంచి చరచరా పనిచేసుకుపోయేవాడు నవ్వితే అతని పెదవి సెలవుల్లో విషాదం చివురించేది మనిషి సన్నని పొడుగైనకారు నల్లని విగ్రహం నవ్వితే అతని హృదయం కరిగి కళ్లల్లోకి కనిపించేది

నిజానికి నాకు మాపల్లెలో అంతమంచి అప్పడనే వాడున్నాడని కూడా తెలియదు మాతాతయ్యతో నేను చాలాసార్లు చేలోకి వెళ్లేవాణ్ణి నాకోసం ఆయన సెనగమొక్కలు పీకి కాయలు తంపటపెట్టే

వాడు ఆ సెనగకాయలు వల్చుకు తిని చీకటిపడే వేళకి ఇంటికి వచ్చేవాళ్లం మా తాతయ్య కిర్రుచెప్పులు తొడుక్కొని, నెత్తిమీద గడ్డిమోపు పెట్టుకొని, మెడమీద అడ్డంగా కర్ర ఆనించి, దొరలా ముందు నడుస్తూఉంటే ఆయన వెనకాలే నడవలేక పరిగెడుతూ ఆయన చెపుతూన్న 'శుక్లాంబరధరంవిష్ణుం' మొదలైన శ్లోకాలు వల్లె వేసేవాణ్ణి నాకు ఆ శ్లోకాలు సరిగ్గావచ్చేవి కావు అసలు ఆశ్లోకాలమీద నాకు ధ్యాసే ఉండేదికాదు మా తాతయ్య చెప్పులే నాకెంతో అసూయగా ఉండేవి సరిగ్గా అలాంటి చెప్పులే తొడుక్కొని రాజఠీవి ఉట్టి పడుతూంటే, కిర్రుకిర్రు మనిపించుకుంటూ, వాటిపై జూలు నృత్యం చేస్తోంటే పరవశం పొందుతూ నడవాలని మనసుగా ఉండేది ఆ జోళ్లమీదనగిషీ నాకెంతో ముద్దొచ్చేది అలాంటి జోళ్లకి నేనే అధిపతినైతే రాజకుమారులు నాముందు బలాదూరేకదా! నాకలాంటి జోళ్లు కావాలని ఎంత మారాముచేసినా వట్టి కుర్రవెధవ కింద కట్టేసి మా తాతయ్య నిర్లక్ష్యం చేసేవాడు నేను ఉండబట్టలేక మా తాతయ్య జోళ్లే తొడుక్కొని తూగిపడుతూ షైర్లు కొట్టే వాణ్ణి మా తాతయ్య ఎంత వారించినా ఊరుకొనేవాణ్ణి కాదు చివరికి విసిగి మా తాతయ్య నావీపు శుద్ధి చేసేవాడు మా 'అమ్మ'ని తలుచుకొని రాగాలు పెట్టే సరికి మా తాతయ్య బాధపడి, నన్నుతొలిసారి అప్పడిదగ్గిరకి తీసుకెళ్లాడు

"తల్లి లేని వెధవ అని గారాం చేస్తూంటే నా ప్రాణాలు కొరుక్కుతింటున్నాడ్రా అప్పడూ ఏదో జత కుట్టిద్దూ" అప్పడు నాకేసి చూసి నవ్వుకున్నాడు కొలతలు తీసుకొని, "అలాగే లెండి", అన్నాడు

అదే మా మొదటి పరిచయం అప్పటి నుంచీ రోజూ బళ్లోకెళ్లేటప్పుడూ, వచ్చేటప్పుడూ అప్పడి దర్శనం చేసుకొనేవాణ్ణి ఏక్షణం అమాంతంగా ఆజోళ్లు తయారై నా కాళ్లని అలంకరిస్తాయో! బళ్లో బట్టలు వేసుకొని, పలకా, బలపమూ, సరస్వతీవాచకమూ తాటాకు సంచిలో పెట్టుకొని బళ్లోకి పోతూపోతూ అప్పడి కిర్రుజోళ్లకోసం తొంగిచూసేవాణ్ణి బళ్లోకూర్చున్నప్పుడు కూడా ఒంటివేలుకనీ, రెండువేళ్ళకనీ, బొటనవేలుకనీ వంకపెట్టి తిన్నగా అప్పడి దగ్గిరకు పోయి కూర్చొనేవాణ్ణి మా ఇద్దరి పరిచయం ఆ విధంగా పెంపొందసాగెది. నేనువచ్చి కూచుంటేనే గాని అప్పడు నా జోళ్ళు కుట్టేవాడు కాదు నాతో ఊసులాడుతూ మురిసిపోయేవాడు

నేనూ అప్పడూ ఊసులాడుకొంటూంటే మా ఊళ్ళోని పెద్దకాపులూ, కరణాలూ - ఎందరో వస్తూఉండేవారు 'అప్పడూ, జోళ్లు' 'అప్పడూ, జోళ్లు'

'అప్పడూ, జోళ్లు' - అందరిదీ ఒకటే పాట 'ఇదిగో, అదిగో' అని ఏదో సర్ది చెపుతూనే ఉండేవాడు అప్పడు 'అబ్బాయిగారి జోళ్లు కుడుతున్నాను; కాగానే' అదో వంక.

"ఎవ రేట్రా?"

"వెంకట్రామయ్యగారి మనవడండి."

"కూతురు కొడుకా? కొడుకు కొడుకా?"

"ఆ రమ్మాయిగోరు పొయ్యారు కదండీ ఆరి కొడుకు"

"ఓహో!" అందరూ నాకేసి వింతగా చూసేవారు ఆమాట చెప్పిన అప్పడికి ఏదో జ్ఞాపకం వచ్చేది కళ్లల్లో విచారం అలుముకొనేది, మాట బరువెక్కేది

"అమ్మోరు ఆణ్ని ఎత్తుకుపోయింది గాని నన్నెత్తుకుపోయిందిగాదు ఆ ఎదవే ఉంటేనా"

"ఎవరి ఖర్మ కెవరు కర్తలురా!"

ఆ కాపులూ, కరణాలూ అప్పడి భారాన్ని విదిలించుకొని "ఒరేయ్ తొందరగా కుట్టేయ్!" అని హెచ్చరించి వెళ్ళిపోయేవారు ఎవరూ అతని దుఃఖాన్ని పట్టించుకొనేవారు కాదు నిజమే, ఎవరి ఖర్మ కెవరు కర్తలు?

ఎవరి ఖర్మ కెవరు కర్తలయినా కాకపోయినా ఎవరి ఖర్మని వాళ్లు అనుభవించక తప్పదు. కాని సృష్టిలోని రహస్యమేమిటంటే ఒకరి ఖర్మను ఇంకొకరుకూడా పంచుకుంటేనే గాని ఆ అనుభవించేవాడికి ఓదార్పు ఉండదు అందుకోసం తన దుఃఖంలో పాల్గొనేవాడికోసం చూస్తాడు ఓదార్పు లభ్యం కాకపోదు కాని అది ఎదటివాడి గుండెల్లోంచి రాదు అలాంటప్పుడు అది బాధపడేవాడి ఆవేదనని రెట్టిస్తుంది, దుఃఖాన్ని ఇనుమడింపజేస్తుంది అయినా అప్పడికి ఇంత నూక్కుపోటానికి కళ్లంలోని గింజ లిస్తూనే ఉంటారు ఓదార్పు ఎక్కణ్ణించి ఇస్తారు? కాలమే దుఃఖభాగుల్ని ఓదార్చాలి ఎవరి దుఃఖాలు వారికే ఉన్నాయి.

ఏ దుఃఖమూ వంటబట్టనివాణ్ణి నే నొక్కణ్ణే అప్పడికి దొరికాను.

"ఏరా, అప్పడూ, అమ్మోరు నీకొడుకును ఎత్తుకుపోయిందా?" అని ప్రశ్నిస్తే చాలు, 'అయ్యనా బాబే' అని ప్రారంభించి తన కొడుకు ఎప్పుడు ఎందుకు ఎలా చచ్చిపోయాడో అదంతా పూసగుచ్చినట్టు చెప్పేవాడు. నేను నోరు ఆవలించుకొని, మోకాళ్లమీద చేతులు ముడుచుకొని, తల ఆనించి శ్రద్ధగా వినేవాణ్ణి.

"పాపం, అచ్చాలుగారు మందో మాకో ఇచ్చేవారండి ఏమిస్తేనేంగాక, యదవ ఆయుస్సుమూడి చచ్చాడు"

అప్పడి కొడుకు ఎలా చచ్చిపోయాడో ఆ చిత్రాన్నంతా ఊహించుకొని, నన్నే అప్పడి కొడుకుగా చిత్రించుకొని, అప్పణ్ణి మా తాతయ్యగా భావించుకొని, ఆ దృశ్యాన్ని భరించలేక ఏడ్చేవాణ్ణి అది చూసి

"చేతికందిన కొడుకు చచ్చిపోయ్యాడు, బాబూ! ఎవరితో చెప్పుకోను, దేవమే చెవిటిది, బాబూ, దేవుడు నా గుండె చెరువు చేసి పుట్టించాడు"

"నీ పిల్లామో!"

"అదా బాబా!" నవ్వేవాడు. "అది తెంపులు చేసుకొని లేచిపోయింది బాబూ, నాతో బతకలేదంట!"

అతనితో ప్రతీదీ ఒక సమస్యే నాకు. నాకు అర్థంకాని, నేను ఊహించలేని ఎన్నో విషయాల్ని అతను తెలియజెప్పేవాడు నాకు సంశయం కలిగేది చిన్నపిల్లాణ్ణి అంతమంచి వాడితో, తనే అంత కలసి మెలసి కాలక్షేపం చేయగలుగుతూంటే 'అదెంచేత' బతకలేక పోయిందో నాకు అర్థమయ్యేదికాదు తెగతెంపులు చేసుకు లేచి పోవటమంటే "ఏమిటో? ఒకసారి మా ఆవు కన్నతాడు తెంపుకొని వెళ్లిపోయిందని విన్నాను మళ్లీ మాఆవును తెచ్చి కట్టుకున్నాం అతను కూడా అలా ఎందుకు చెయ్యకూడదు?

"అంటే?"

"ఏంలేదు బాబూ, నన్నొదిలేసింది"

"నీకు నీతల్లి ఉందా?"

"లేదు బాబూ!" నవ్వేవాడు

పాపం, తల్లిలేనివాణ్ణి అలా వొదిలేస్తే ఏమైపోతాడు? తల్లిలేని నన్ను మా తాతయ్య వదిలేస్తే నే నేమైపోవ్వాలి? అడుక్కుతినాలి ఎలాగమరి! పెద్దవాడుగా అప్పడు! పెద్దవాళ్లని అందరూ వదిలేస్తారు గావును! నేను కూడా పెద్దయ్యాక మా తాతయ్య నన్ను వదిలేస్తాడు ఎక్కాలబాధ వదిలిపోతుంది కాని, నాభార్యకూడా లేచిపోతుందా?

"ఎందుకు వదిలేసిందీ? అందంగా లేదనా?"

"అందమేటి, బాబూ; కంటికోఅందం, నోటికోరుచీనీ ఈ జోడు చూడు ఇంత అందమైందిగదా, ఎందుకు తొడుక్కోవూ అంటావ్ ఆ జోడు ఎక్కడ కరుస్తదో తొడిగేవాడికి తెలియాలిగాని నీకు తెలుస్తదా?"

నిజమే మరి; జోడు కరుస్తుంది కాబోలు నా జోడుకూడా కరుస్తుందా?

"జోడు ఎందుకు కరుస్తుంది, అప్పడూ?

"ఏడెక్కితే కరుస్తది"

అవన్నీ నాకర్థంకాని సమస్యలు మా బళ్లో 'ఆవు పాలు ఇచ్చును,' అని చెప్తారు గొడ్డుఆవు పాలిస్తుందా? అది ఎందుకివ్వదో చెప్పరు అలాగే ఈ సమస్యలకి కూడా.

మొత్తానికి నాకు జోళ్లు తయారై పోయాయి మా తాతయ్య పావలా ఇస్తే వద్దన్నాడు "అబ్బాయిగారి జోళ్లకికూడా డబ్బిచ్చుకోవాలా, దొరగారూ? ఆకే కేపు పెద్దాగ కానిసేబిల్ గిరీ చేసి నా ఋణం తీర్చుకుంటారులెండి"

మా తాతయ్య నవ్వి ఊరుకున్నాడు ఆ జోళ్లకి ఆయన డబ్బివ్వనేలేదు ఆ ఋణం మాత్రం నా భుజాలమీద ఎప్పటికీ మిగిలి పోయే ఉంది ఆ ఋణం తీర్చుకోవటానికని అప్పటి స్నేహం వదిలిపెట్టలేదు నేను మా తాతయ్య అంగోస్త్రాన్ని కుచ్చుల తల పాగాగా చుట్టుకొని, తాటాకుసంచీ చంక కింద పెట్టుకొని, కిర్రుజోళ్లు తొడుక్కొని యువరాజులా నడుస్తూ రోజూ మధ్యాహ్నం పన్నెండుగంటలకే బరికి బయలుదేరి అప్పడి దగ్గర కూర్చునేవాణ్ణి

ఆ సంగతి మా తాతయ్యకి తెలిసి నన్ను ...గా కేకలేసేవాడు అయినా చాటునా ...నా అప్పడిదగ్గరకే పరిగెత్తేవాణ్ణి

"వాడు మాదిగాడురా దగ్గిర కెడితే స్నానం చెయ్యాలి నీకు ఒడుగుఅయింది కదా పితృదేవతలకు గతులు తప్పుతాయి," అనేవాడు తాతయ్య

"దూరంగా కూర్చోండి, అబ్బాయిగారూ, తాతయ్యగారు కోప్పడతారు తప్పు" అనేవాడు అప్పడు

అప్పడు కుట్టిఇచ్చిన జోళ్లు తొడుక్కుంటే గతులు తప్పని పితృదేవతలు, అప్పడికి దగ్గరగా కూర్చుంటే ఎందుకు తప్పుతారో నాకు తెలియలేదు

నాకు తెలియని చాలా సంగతుల్లో, అప్పడికి డబ్బు ఎలా వస్తోందో, ఆ వచ్చిన డబ్బు సరిపోతోందో లేదో -కూడా ఒకటి

"నీకు డబ్బుందా, అప్పడూ?"

"బలేవాడివోయ్, కుర్రయ్యా!" పకపకా నవ్వేవాడు అప్పడు "మీరంతా చల్లగాఉంటే నాకేం లోటు, బాబూ!" వెంటనే అతని ముఖం గంభీరమయ్యేది "ఈ జోడు చూడు, బాబూ తొడిగితే చాలదనుకో నిన్ను కరుస్తది ఎక్కువైందనుకో - తుళ్ళితుళ్ళిపడతావు అలాగే డబ్బుకూడా ఒక్క పొట్టకి ఏమాత్రం కావాలి, బాబూ!"

చిత్రమేమిటంటే నేను ఒకటోక్లాసు సరస్వతీవాచకంలో నేటికి ఇరవై సంవత్సరాల క్రిందట ఏం చదువుకున్నానో నాకు జ్ఞాపకం లేదు కాని ఇరవై సంవత్సరాల కిందట అప్పడు ఏ రోజున నాకు ఏ పాఠం చెప్పాడో ఒక్క పొల్లుకూడా పోకుండ నేటికీ నాకు జ్ఞాపకం ఉంది బడిపంతులు కొట్టి, తిట్టి, 'అల - తల' అనమనేవాడు. అప్పడు, బాబూ, బాబూ, అంటూనే జీవితాన్ని చదివి చెప్పేవాడు బడిపంతులు పెద్ద చదువులు చదువుకున్నాడు అప్పడు ఏమీ చదువుకోలేదు

ఏమీ చదువుకోని అప్పడిదగ్గర చేరి నేను పాడైపోతున్నానని మా తాతయ్య ఎక్కువ బాధపడ్డాడు నా భవిష్యత్తూ, బాగూ కోరి ఒకసారిమాత్రం తట్టు తేలేలా కొట్టాడు అప్పట్నుంచీ నేను అప్పడి దగ్గరికి వెళ్లటం మానేశాను బళ్లోకి పోతూ కిర్రుచెప్పులుకూడా తొడగటం మానేశాను. ఎందుకంటే, ఎందుకంటే, ఆ జోళ్లు తొడుక్కొని నేను అప్పడు కూర్చున్న అరుగు ముందునుంచి పోతూంటే, ఆ జోళ్లే నన్ను అప్పడిముందు నిలబెట్టేవి అందుకనే ఆ జోళ్లంటే భయపడేవాణ్ణి ముఖం ఎదటి గోడవైపు తిప్పేసుకొని గుర్రపుదౌడు తీస్తూ అప్పడి ముందునుంచి పరిగెత్తేవాణ్ని ఆ పక్క మలుపు తిరిగి, గోడకి బల్లిలా అంటుకుని వెనక్కి తిరిగిచూసేవాణ్ని నేను వచ్చినదిక్కుకే చూస్తూ నిశ్చేతనంగా నిలబడి పొయ్యేవాడు అప్పడు

ఒకరోజున బరినుంచి వస్తోంటే, దారికడ్డంగా నించొని "అబ్బాయిగారూ, తాతగారు కోప్పడ్డారా?" అన్నాడు. ఆ ఓదార్పు నన్ను చాలా అవమానించింది పట్టలేక వెక్కివెక్కి ఏడ్చాను "ఎర్రినాయనా, ఎయ్యేళ్లు బతుకు నా తండ్రీ!" అని అప్పడు నన్ను దీవించి కళ్లనీళ్లతో వెళ్లిపోయాడు




1 తులము టిన్నులలో అన్నిచోట్ల దరకును.

శ్రీ అంబాళ్ అండు కంపెని,

తపాలుపెట్టె నెం 8 మదరాసు

ఇంకొకసారి కొత్తజోళ్లు కుట్టి, "ఇవి తొడుక్కో, బాబూ! పాతవి పోయినట్టున్నాయి!" అన్నాడు నేను వినిపించుకోకుండా, తప్పించుకుని పారిపోయివచ్చేశాను. ఆ రాత్రికే నాకు విపరీతంగా జ్వరం వచ్చేసింది. ఆ తరవాత కొద్దిరోజులకే నేను బస్తీకి వెళ్లిపోయాను.

మేనమామగారింట్లో నేను చదువుకున్న పదిహేను సంవత్సరాల్లోనూ నేను తిరిగి మా తాతయ్యగారి ఊరు వెళ్లవలసిన అవసరం లేకపోయింది. నేను బస్తీకి వచ్చిన చాలా కొద్దికాలానికే మా తాతయ్య స్వర్గస్థుడయ్యాడు మా తాతయ్య బాపతు రెండెకరాల పొలం మా మామయ్యకొచ్చింది నా బాపతు రెండెకరాలు మా మామయ్యే అమ్మి నా చదువుకు ఖర్చుపెట్టాడు.

చదువుసంధ్యలు పూర్తై మళ్లీ ఇరవై సంవత్సరాలకు మా తాతయ్యగారి ఊరు వెళ్లాను ఆ ఊరుఊరంతా మారిపోయింది నా చిన్ననాటి వీథులుగాని, ఆ ఇళ్లుగాని, నా చిన్నప్పటిలా కచేరీ సావిట్లో కలుసుకోవటంగాని-ఏమీ లేదు ఒక రైలుస్టేషన్, బస్సుస్టాండు, కాఫీహోటళ్లు, మేడలు అన్నీ అంతా కొత్తే

బస్సుదిగి మా స్కూలుపక్క అరుగు మీదకి చూశాను. అక్కడ ఒక రెండంతస్తుల మేడ కనిపించింది. దానికింద గదిలో క్షవరశాల. ఆ ఊరి పని పూర్తి చేసుకొని వెళ్లిపోతూ, ఉండబట్టలేక, అప్పణ్ణిగురించి తెలుసుకోవాలని చాలా ప్రయత్నించాను బస్సుస్టాండు పక్క మేడలో 'వసంతకాలపు నూతన అలంకారాలు బాటా జోళ్లు' అన్న ప్రకటన అప్పుడికీ వసంతకాలానికీ ఏమి సారూప్యాన్ని ఊహించుకోగలను?

నేను వెళ్లవలసిన కారు రాలేదు ఒక గంట ఆగవలసివచ్చింది. కారు స్టాండు కెదురుగా కాఫీహోటల్లో ఫలహారంచేసి ఆపక్క కిళ్లీకొట్లో మిఠాయికిళ్లీ కట్టించుకొంటూ నిలుచున్నాను ఆపక్క మురికికాల్వ గట్టున తాటాకుగొడుగుల క్రింద కూర్చుని ఇద్దరు ముగ్గురు మాదిగవాళ్లు "జోడుకు పాలిష్ చేయమంటారా?" అని అడిగారు

ఏమీ ఉబుసుపోక అందులో ముసలాడికి నా జోడు ఇచ్చి పాలిష్ చేయమన్నాను. వాడు జోడు చేత్తో పుచ్చుకొని ఇటూ అటూ తిప్పి, ముఖం చిట్లించి

"ఇదేం జోడు బాబూ, యదవచర్మం! కాలం మండిపోతోంది," అన్నాడు పదిహేనురూపాయలుపోసి నేను కొన్నజోడు ఇలా అవమానింపబడటం నాకే అవమానమయింది. దాని ఖరీదు సంగతీ, దాని ప్రశస్తి సంగతీ అంతా చెప్పాను

"అంతా కుంపినీవోడి మాయండి ఈ రోజుల్లో మాఅయితే రెండు రూపాయలయ్యేను మా రోజుల్లో కిర్రుజోడు కుట్టి పావలా కిచ్చేవాళ్లం. పాతికేళ్లు మన్నేది అంతా కలికాలం వచ్చేసింది, బాబూ!"

"ఏమోయి, అప్పుడని ఉండేవాడు, నా చిన్నతనంలో జోళ్లు కుట్టేవాడు వాడేమయ్యాడో తెలుసా?"

"అడాండీ—ఎక్కడో చచ్చాడు లెండి, ఏం జస్తేనే! దేనికి లోపం వచ్చినా ఆ రోజుల్లో ఖుకితికి లోపం ఉండేదికాదండి ఇప్పటోళ్లకి నాజూకే గాని నాణ్యం అక్కర్లేదండి న్యాయానికి రోజులుకావండి ఆ కుర్రాళ్లే ఏరు, ఆ వరసే ఏరు ఎంకట్రామయ్యగారి మనవడుండేవాడు అట్టాంటి కుర్రాళ్లే లేరు"

నేను కొయ్యబారిపొయ్యాను. నేనే ఆ మనవణ్ణని చెప్పుకోటానికే సిగ్గేసింది. వాడికి రూపాయ చేతులో వేసి వాడు చిల్లర పట్టుకు పరుగెత్తుకొస్తుంటే వినిపించుకోకుండా బండిలో పడి, 'స్టేషన్‌కి పోనియ్ వోయ్' అన్నాను

అప్పుడు రాయిలా నిలబడిపొయ్యాడు.

★

---

"నేను చిన్నతనంలో రోజూ విధిగా స్కూలుకి వెళ్లేవాడిని. అయితే అందువల్ల నా చదువేమీ చెడిపోకుండామాత్రం జాగ్రత్త పడేవాడిని."

—మార్క్ ట్వేన్.

* * * *

"డార్లింగ్! మనపెళ్లిని కొంతకాలందాకా వాయిదా వేద్దాం," అన్న దొక హాలీవుడ్ సినిమాతార ప్రియుడితో.

"ఏం, నేనంటే నీకు ప్రేమ లేదా?" అన్నాడు ప్రియుడు.

"అదికాదు. నేను నిన్ననే ఇంకొకర్ని పెళ్లాడాను."